







నేటి దినపత్రిక
17వ
సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
ఆదివారం,21 జూలై 2024




## జిల్లా జేసిగా ధాత్రిరెడ్డి,ఐటిడిఎ పిఓగా హరిత నియామకం

**– ప్రసన్న వెంకటేష్,లావణ్యవేణి,సూర్యతేజ బదిలీ**

**ఏలూరు,సూర్య బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి 66 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. జిల్లాలోని అధికారులను బదిలీ చేసి నూతన అధికారులను వారి స్థానంలో నియమించారు. ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పి.ధాత్రి రెడ్డిని నియమించింది. ఆమె భర్త జిల్లా ఎస్‌పిగా ప్రతాప్ శివ కిషోర్ ఇటీవల జిల్లాలో బాధ్యతలు చేపట్టారు.జెసి బి.లావణ్య వేణ సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఇంత కాలం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతల నిర్వహించి పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న వే.ప్రసన్న వెంకటేష్‌కు సోషల్ వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూ షన్స్ సొసైటీ సెక్రటరీగా నియమించింది. ఐటీడీఏ పీవో ఎం సూర్య తేజను నెల్లూరు జిల్లా మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేసింది.అయన స్థానంలో పిఓగా ఐఎఎస్ అధికారిణి డి.హరిత నియమితులయ్యారు.అదేవిధంగా ప.గో.జిల్లా జాయింట్ కలెక్టర్ సి.వి ప్రవీణ్ ఆదిత్యను బదిలీ చేసి ఏపీ చీఫ్‌ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించారు.

# వరద బాధితులను అన్నివిధాలా ఆదుకుంటాం

**- నీరు తగ్గిన వెంటనే నష్టాలపై గణన - బాధితులకు నష్టపరిహారం - అల్లూరినగర్,మేడిపల్లిలో ప్రతీ ఇంటికి వెళ్లి బాధితులకు పరామర్శ - మంత్రి పార్థసారథి,ఎమ్మెల్యేలు చింతమనేని,సొంగ,చిర్రి,అధికారులు**

వేలేరుపాడు,మేజర్‌న్యూస్:వరదబాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహనిర్మాణశాఖా మంత్రి కొలుసు పార్థసారథిచెప్పారు.కుక్కునూరు,వేలేరుపాడు మండలాల్లోని వరద బాధితులను శాసనసభ్యులు చిర్రి బాలరాజు,చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యావేణి, ఇతర జిల్లా అధికారులతో కలిసి శనివారం కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథివేలేరుపాడుమండలం అల్లూరినగర్ ,మేడిపల్లిలో వరద కారణంగా దెబ్బతిన్న ప్రతీ ఇంటిని పరిశీలించి, ప్రతీ బాధిత కుటుంబం వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అల్లూరినగర్,మేడిపల్లిలోని వరద బాధితులు వరద కారణంగా తాము సర్వస్వం కోల్పోయామని, తమను ఆదుకోవాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ వరద నీరు తగ్గిన వెంటనే వరద ప్రభావిత గ్రామాలలో వరద నష్టాలను




ఆయా శాఖలఅధికారులు లెక్కించడం జరుగుతుందని, సదరు గణననుఅనుసరించి బాధితులకు నష్టపరిహారం అందించడంజరుగుతుందన్నారు.

భారీ వర్షాలు ప్రారంభం ఐనప్పటినుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గోదావరి వరద వచ్చే అవకాశం ఉన్న కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం, తదితర మండలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవలసిందిగా జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారన్నారు. వరద నీరు పూర్తిగా తగ్గేవరకూ బాధితులకు వరద సహాయ కేంద్రాలలో భోజన, వసతి సౌకర్యాలు కల్పించడంజరుగుతుందన్నారు. అనంతరం మేడిపల్లిలో నిత్యావసర వస్తువుల స్టాక్ పాయింట్ ను మంత్రి పరిశీలించారు. ముందుగామంత్రి పెద్ద వాగుపై కుమ్మరి గూడెం వద్ద వరద కారణంగా దెబ్బతిన్న వంతెనను పరిశీలించారు.మంత్రివెంట అధికారులు పాల్గొన్నారు.

# ఏలూరు జిల్లాలో దెబ్బతిన్న 12 గ్రామాలు

**- 7 వేల 450 ఎకరాలలో వరి పంట,290 ఎకరాల్లో నారుమళ్లకు నష్టం**
**- ప్రాధమిక అంచనాలు వివరించిన మంత్రి 'కొలుసు'**

**ఏలూరు/వేలేరుపాడు,మేజర్‌న్యూస్:** పెదవాగు కు ఆకస్మిక వరదల కారణంగా ఏలూరుజిల్లాలో 12 గ్రామాల తీవ్రంగా దెబ్బతిన్నాయని రాష్ట్రసమాచారపౌర సంబంధాలు, గృహ నిర్మాణశాఖా మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. వేలేరుపాడు మండలంలో శనివారం వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి,వరద సహాయక చర్యలపై అధికారులతో సమీక్షించిన అనంతరం పాత్రికేయులతో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్ట్‌ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలలోఉన్నదని,ప్రాజెక్ట్ నిర్వహతెలంగాణా ప్రభుత్వం. ాధారణ వర్షపాతం కంటే మూడింతలు ఎక్కువ వర్షపాతం నమోదైందన్నారు.గత మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాజెక్ట్ లో అధికంగా వరద నీరు నీరు చేరుకోవడంతో పెదవాగు ప్రాజెక్ట్ 200 మీటర్ల మేర దెబ్బతినడంతో,వరదనీరువేలేరుపాడు, కుక్కునూరు మండలంలోని 7 గ్రామ పంచాయతీలకు చెందిన 12గ్రామాలువరద తీవ్రతకు దెబ్బతిన్నా యన్నారు. ప్రాధమిక అంచనాల ప్రకారం వరదల కారణంగా 7 వేల 450 ఎకరాలలో వరి పంట దెబ్బతిన్నదని, 290 ఎకరాల్లో



వరి నారుమళ్లుదెబ్బతిన్నాయన్నారు.వరదలలో నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు కార్యకర్తల సహాయంతో సేవలు అందిస్తున్నందుకు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి అభినందించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యావేణి, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఎం. సూర్యతేజ, శాసనసభ్యులు చిర్రి బాలరాజు,చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, ప్రభృతులు పాల్గొన్నారు.

### విజయసాయిరెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ జర్నలిస్టుల ధర్నా



నర్సాపురం,మేజర్ న్యూస్: వైసీపీ నాయకులు విజయ సాయి రెడ్డి ఈనెల 15న విశాఖపట్నంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జర్నలిస్టులను కించపరుస్తూ మాట్లాడడాన్ని నిరసిస్తూ శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో అచ్యుత అంబరీష్ కు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలోప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఇజ్రాయెల్ మాట్లాడుతూ ఏక వచనంతో ఉన్న జర్నలిస్టులను వ్యక్తిగత విమర్శలు చేయటం ఆయన హెూదాకు తగదన్నారు. కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విలేకరులకు క్షమాపణలు చెప్పాలని అన్నారు. విజయసాయి రెడ్డి పై చర్యలు తీసుకోవాలని సీనియర్ జర్నలిస్ట్ జిఎం రాంబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యదర్శి నాయుడు మారుతీరావు, మద్దాల మురళీధర్, చెరుకూరి రాజేష్, సత్యనారాయణ, సందీప్, పండు, ప్రభాకర్తదితరులు పాల్గొన్నారు.

### మానవత్వం చాటుకున్న శాసనసభ్యులు సొంగా రోషన్



**లింగపాలెం,మేజర్ న్యూస్:** లింగపాలెం మండలం కొణిజర్ల గ్రామంలో మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 8 సంవత్సరాల బాలుడు పొదిల ధనుష్ (సాయి, భవాని తల్లిదండ్రులు) విషయం తెలుసుకుని టిడిపి నాయకులను శరవేగంగా ఏలూరు ఆశ్రమం హాస్పటల్ పంపించి వైద్య సిబ్బందితో మాట్లాడి మెరుగైన వైద్యం ధనుష్ కు అందించాలని ప్రత్యేకమైన దృష్టి సారించాలని సూచించిన రోషన్ కుమార్. అనంతరం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం అందించిన చింతలపూడి నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులు పల్లి శ్రీను,నారా లోకేష్ యువజన ఫౌండేషన్ జిల్లా అధికార ప్రతినిధి అన్నపరెడ్డి గంగాధర్, జిల్లా బీసీ సాధికారిక అధ్యక్షుడు కొప్పెర్ల నాగరాజు,బీజేపీ మండల అధ్యక్షులు వర ప్రసాద్ తదితరులు.

### నూజివీడు నగరవాసులకు శుద్ధ జలాలు

**– మంత్రి 'కొలుసు'చొరవతో త్రాగునీటిని సమస్య పరిష్కారం**




**ఏలూరు,మేజర్ న్యూస్:**నూజివీడు పట్టణ వాసులకు శుభ్రపరచిన సురక్షితమైన కృష్ణా నది త్రాగునీరును శుక్రవారం నుంచి అందిస్తున్నట్లు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి తెలిపారు. గత 3 సంవత్సరాల నుండి కృష్ణా నది త్రాగునీటి స్టోరేజ్ ట్యాంక్ శుద్ధి యంత్రాలను శుభ్రం చేయకుండా గత పాలకులు అలా గాలికి వదిలేసి అశుభ్రమైన నీటిని నగర ప్రజలకు అందిస్తున్నారని తద్వారా ప్రజలకు మురిగి నీరు కలుషితమైన నీరు త్రాగడంతో జ్వరాలు, దగ్గు, పలు రకాల జబ్బుల బారిన పడి ఎంతో ఇబ్బంది పడుతున్నామని ఈ మురికి నీటిని త్రాగ లేకపోతున్నామని మంత్రివర్యుల దృష్టికి తీసుకెళ్లిన ప్రజలు సమస్యను విన్న మంత్రివర్యులు తక్షణమే మున్సిపల్ అధికారులను పిలిపించి తక్షణ చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.శుద్ధి చేసిన తరువాతే త్రాగునీటిని ప్రజలకు వదలాలని మున్సిపల్ కమీషనర్‌ని హెచ్చరించారు. మంత్రి హెచ్చరించిన 24 గంటల్లో శుభ్రం చేసిన స్వచ్ఛమైన నీరు అందడంతో నగర ప్రజలు తమ హర్షాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# వరదలు తగ్గుముఖం పట్టేవరకు అప్రమత్తత

**– సహాయక చర్యల్లో ఉదాసీనతకు తావులేదు :జిల్లా కలెక్టర్**



**ఏలూరు,మేజర్‌న్యూస్:**భారీవర్షాలు,వరదలు మూలంగా తలెత్తే పరిణామాలను ముందస్తు ప్రణాళికతో సమర్థవంతంగా ఎదుర్కొంటూ ఎటువంటి ప్రాణ, పశు నష్టం జరుగకుండా పటిష్టమైన చర్యలతో మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ బంగ్లా నుండి శనివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పునరావాస కేంద్రాల్లోఅవసరమైన బియ్యం, నూనె, పప్పు, కొవ్వొత్తులు, తదితర వాటినిఅందుబాటులో ఉంచాలన్నారు.విద్యుత్ సరఫరాకుఅంత రాయం లేకుండా జనరేటర్లను సిద్ధం చేసుకోవాలన్నారు.గోదావరి వరద, ఎర్రకాలువ, తమ్మిలేరు, కొల్లేరు నీటి ప్రవాహాలను ఎప్పటికప్పుడు గమనిస్తూఅవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ఏదైన సమస్య ఉత్పన్నమైతే ఎటువంటి సంకోచం లేకుండా ఏ సమయంలోనైనా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కొండవాగు పరిస్థితినిఎప్పటికప్పుడు పరిశీలించాల న్నారు. నూజివీడు డివిజన్‌కు సంబంధించి వర్షాకాల సీజన్‌లో ఎక్కువ విద్యుత్ షాక్‌కు గురౌతున్న సంఘటనలు తలెత్తుతున్నాయని ఇందుకు సంబంధించి ఎపిఇపిడిసిఎల్ అధికారులతో సమన్వయం చేసుకొనిఅవసరమైనచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పివో యం.సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

# సహాయక చర్యల నిర్లక్ష్యంపై మంత్రి సీరియస్

**– వరద బాధితుల ఫిర్యాదుపై స్పందించిన మంత్రి పార్థ సారథి**

**వేలేరుపాడు,మేజర్ న్యూస్ :** పెద్దవాగు ప్రాజెక్టుకు రెండు చోట్ల గండి పడటంతో మండలంలోఅల్లూరినగర్,మేడే పల్లి,కోయ మాధవరం,ఊట గుంపు,రాళ్ళ పూడి కమ్మరి గూడెం గ్రామాలు ముంపునకకు గురైయ్యాయి. గత 3 రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు జన జీవనం అతలాకుతలం గా మారింది.ఈ నేపథ్యంలో శనివారం వరద ప్రభావిత ప్రాంతాల్లో హౌసింగ్,ఇన్ఫర్మేషన్ పబ్లిక్ రిలేషన్ మంత్రి కొలుసు పార్థ సారథి,దెందులూరు యంఎల్ఏ చింతమనేని ప్రభాకర్,చింతల పూడి యంఎల్ఏ సొంగా రోషన్ కుమార్ ,పోలవరం యంఎల్ఏ చిర్రి బాలరాజు,జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి తో కలసి మంత్రి పర్యటించారు. బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా భోజన వసతి తదితర సహాక చర్యలు అధికారులు అలసత్వం వహిస్తున్నట్లు బాధితులు మంత్రి దృష్టికి తీసుకు రావడంతో సంభందిత అధికారులపై సీరియస్ అయ్యారు. అల్పాహారం,బోజన




వసతి ఎందుకు కల్పించ లేదని అధికారులను ప్రశ్నించారు. ఊర్లు,ఇళ్ళు మునిగిపోయిన బాదితుల పట్ల నిర్లక్ష్యం చేయడం పై మండి పడ్డారు. సహాయక చర్యలుముమ్మరంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పెదవాగు ప్రాజెక్టు వలన అనేక మంది నిరాశ్రయుల్యారని ప్రతీ ఒక్క కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని హామి ఇచ్చారు. ఈ పర్యటనలో టీడీపీ నియోజక వర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్,మండల అధ్యక్షులు అమరవరపు అశోక్,సుంకవల్లి సాయి,కొమ్మన వేంకటేశ్వర రావు,శాఖ మూరి సంజీవులు,కట్టం రాంబాబు సుభాష్ చంద్ర బోస్ తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధిత కుటుంబాల ఇంటివద్దకు భోజనం



**– బాధితులకు మెరుగైన సేవలు – అలసత్వాన్ని సహించం**
**– రాష్ట్ర సమాచార,గృహ నిర్మాణ శాఖా మంత్రి పార్థసారథి**

**వేలేరుపాడు,మేజర్ న్యూస్: వరద** బాధిత కుటుంబాలకు ఇంటివద్దకు భోజనం అందించాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. వేలేరుపాడు మండలంలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన అనంతరం మేడేపల్లిలోని గ్రామ సచివాలయంలో శాసనసభ్యులతో కలిసి వరద సహాయక చర్యలపై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ వరదలకారణంగా బాధితుల ఇళ్ళు దెబ్బతిని, సామానులు వరద నీటిలో కొట్టుకుపోయాయన్నారు.బాధిత కుటుంబాలకుఉదయం అల్పాహారంతో టీ,చిన్న పిల్లలకు పాలు,మధ్యాహ్నం,రాత్రి భోజనాలను వారి ఇంట వద్దకు అందించాలన్నారు. ప్రసవ సమయానికి దగ్గరగా ఉన్న గర్భిణీలను అత్యవసరంగా దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని, పిల్లలు, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. సహాయక చర్యలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని, సహాయక చర్యలలో సిబ్బంది ఎటువంటి అలసత్వాన్ని వహించినా తీవ్రంగా పరిగణించడం జరుగుతుందని మంత్రి హెచ్చరించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యావేణి, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఎం.సూర్యతేజ, శాసనసభ్యులు చిర్రి బాలరాజు,చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్య ,జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాధ్, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి ఆర్.ఎస్.సత్యనారాయణ రాజు, జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మంజుభార్గవి, ఆర్ డబ్ల్యూ ఎస్ఎస్ఈ సత్యనారాయణ, ప్రభృతులు పాల్గొన్నారు.

# మామను ఆతి కిరాతకంగా కొట్టి చంపిన అల్లుడు

**– ఐ.ఎస్ జగన్నాధపురం గ్రామంలో దారుణం**

**ద్వారకతిరుమల,మేజర్ న్యూస్:** కుక్కిరిపాటి సుబ్బారావు మృతుడు పాత కాకులు లాజరుగా (65)గుర్తింపు మృతుడు పాతకాకుల లాజరు తన కుమార్తెను గత 20 సంవత్సరాల క్రితం జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన కొక్కిరపాటి సుబ్బారావుకి ఇచ్చి వివాహం చేశాడు విరికి ఇద్దరూ సంతానం.ఒక సంవత్సరం క్రితం నుంచి కూతురికి అల్లుడికి మధ్య మనస్పర్థలు రావడంతో కుమార్తె తండ్రి లాజరు ఇంటి వద్దనే ఉంటూ కూలి పని చేసుకుంటుంది భార్య కుటుంబ పోషణ కోసం కువైట్ వెళ్లేందుకు నిన్న శుక్రవారం బయలుదేరి హైదరాబాద్కు చేరుకుంది. భార్య కువైట్ వెళ్లేందుకు కారణం మామ లాజరు అనే అనుమానంతో అల్లుడు సుబ్బారావు రాత్రి 11.గంటలు సమయం దాటిన తర్వాత ఐ.ఎస్ జగన్నాధపురం మృతుడి ఇంటికి వచ్చాడు.నిద్రలో ఉన్న మామను బలమైన ఆయుధంతో కొట్టడంతో ఘటన స్థలంలోనే మృతి




చెందిన లాజరు. పోలీసులు క్లూస్ టీమ్,డాగ్ స్క్వాడ్ లాతో పూర్తి వివరాలు సేకరిసున్నారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు హత్య చేసిన వ్యక్తి గతంలో కూడా పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నట్లు సమాచారం. ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్న ఏలూరు సబ్ డివిజన్ డిఎస్పి శ్రీనివాసులు.ఉద్యోగరీత్యా ఈరోజు మృతుడి కుమార్తె విదేశాలు వెళ్తున్న నేపథ్యంలో అది ఇష్టంలేని అల్లుడు హత్య చేశాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### వరద ప్రాంతాల్లో ప్రాణనష్టం,అస్థినష్టం జరగకుండా చర్యలు

**– సిఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పనిచేయాలి**



**అమరావతి/పాలకొల్లు,మేజర్ న్యూస్:** రాష్ట్రంలో కురుస్తున్న అధిక వర్షాలను దృష్టిలో పెట్టుకుని ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ప్రాణ నష్టం,ఆస్తి నష్టం జరగకుండా ఎంత విపత్తు వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కోవాలన్న చంద్రబాబు ఆదేశాలకనుగుణంగా క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా పనిచేస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో ఆయన ఛాంబర్‌లో శనివారంరాష్ట్రంలో కురుస్తు న్న అధిక వర్షాలు,వరదలుపరిస్థితిపైఅధికార యంత్రాంగంతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కురుస్తున్న అధిక వర్షాలను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నా మని చెప్పారు. ఎక్కడ ప్రాణం నష్టంగానీ, ఆస్తి నష్టంగానీ జరగకూడదని అధికారులు సిబ్బంది క్షేత్రస్థాయిలోనే మకాం వేసి ఎప్పటికప్పుడు అంచనా వేసుకోవాలని ఆదేశించామన్నారు.బియ్యం, నిత్యవసర సరుకులు, కూరగాయలు,గ్యాస్ తదితర సామాగ్రిని సిబ్బందితో రెవెన్యూ అధికారులు సిద్ధం చేసుకోవాలని తెలిపినట్లు చెప్పారు. వరద ముంపు ప్రాంతాలలో నెలలు నిండిన గర్భిణీ స్త్రీలను, దీర్ఘవ్యాది గ్రస్తులను, బెడ్ రెస్ట్ తీసుకుంటున్న పేషెంట్లను గుర్తించి దగ్గరలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్లో జాయిన్ చేయాలని ఆదేశించామని మంత్రి రామానాయుడు తెలిపారు.

### నేడు వేలేరుపాడులో ఎంపి పుట్టా మహేష్ పర్యటన



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ ఈనెల 21వ తేదీ ఆదివారం వేలేరుపాడు మండలంలో పర్యటించనున్నారు.ఉదయం6 గంటలకు ఏలూరు నుండి బయలు దేరి ఉదయం 7.30 గంటలకు జంగారెడ్డిగూడెం చేరుకుంటారు. అనంతరం ఉదయం 8.30 గంటలకు జంగారెడ్డిగూడెం నుండి బయలుదేరి ఉదంయ 9.30 గంటలకు వేలేరుపాడు మండలం కమ్మవారిగూడెం చేరుకుని వరద బాధిత ప్రాంతాలను పరిశీలించి బాధితులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తారు. తిరిగి ఉదయం 11.30 గంటలకు కమ్మవారిగూడెం నుండి బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు జంగారెడ్డిగూడెం చేరుకుంటారు. తిరిగి మధ్యాహ్నం 2గంటలకు జంగారెడ్డిగూడెం నుండి బయలుదేరి మధ్యాహ్నం 3.00 గంటలకు ఏలూరు చేరుకుంటారు.

### వరద ప్రాంతంలో సుడిగాలి పర్యటన చేసిన కూటమి నేతలు

**– సాయం అందించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపు**



**పెంటపాడు,మేజర్ న్యూస్:** తాడేపల్లి గూడెం నియోజక వర్గంలో తుఫాను ప్రభావంతో వరద ముప్పు మరింత పెరిగే ప్రమాదం ఉందని కూటమి నాయకులంతా రోడ్లపైకి వచ్చి ప్రజలకు సాయం అందించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. పెంటపాడు మండలంలో దర్శపర్రు, వల్లూరు పల్లి, రాచర్ల, రావిపాడు,బి కొండెపాడు, మీనవల్లూరు, రామచంద్రపురం గ్రామాల్లో శనివారం ఆయన ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఆయనతో రైతులు తమ సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో భారీగా 20వేలు ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందని ఈ నష్టంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే కలెక్టర్ కు తగిన సూచనలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాబ్జి, కూటమి నాయకులు, రైతులు,వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు, మండల పరిషత్ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
పశ్చిమ గోదావరి
ఆదివారం,
21 జూలై 2024


## నీట మునిగిన వరి పంటలను పరిశీలించిన ఏవో



అగిరిపల్లి,మేజర్ న్యూస్: అల్ప పీడనం వలన గత 4 రోజులు గా కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన వరి పంటలను మండల వ్యవసాయ అధికారి పలగాని చెన్నారావు శనివారం పరిశీలించారు.మండల పరిధిలోని సగ్గూరు, కృష్ణవరం తదితర గ్రామాలలో సందర్శించి వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ నీట మునిగిన వరి పొలాలు దెబ్బతినే అవకాశం ఉన్నందున, రైతులందరూ పొలాల్లో నీరు ఎక్కువగా ఉంటే బయటకు తీసివేయాలని తెలిపారు.నేరుగా విత్తిన వరి పొలాలలో నీరు నిలువ వున్నట్లయితే వరి పొలాల్లో నీటిని బయటకు తీసివేసిన తరువాత, ఎకరానికి 20 కేజీల యూరియా,20 కేజీల పోటాష్‌ను వేసుకొని లీటర్ నీటికి,రెండు గ్రాముల మ్యాంకొజెబ్ లేదా రెండు గ్రాముల కార్బండిజం మందును పిచికారి చేసి, తెగుళ్ల నుంచి వరి పంటను రక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ఆయా గ్రామాల రైతులు, పాల్గొన్నారు.

## నాయకర్ కోసం మొక్కుబడి చెల్లించుకున్న అభిమాని



నర్సాపురం, మేజర్ న్యూస్: శాసనసభ్యునిగా బొమ్మిడి నాయకర్ విజయం సాధించాలని బేతపూడి గ్రామం ఏలుబండి సాయిబాబు సత్య దంపతులు భీమవరం మండలం యనమదురు గ్రామంలో ఉన్న శ్రీ శక్తీశ్వర స్వామి వారిని మొక్కుకున్నారు.శనివారంశాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ సమక్షంలో ఆలయాలంలో 108 కొబ్బరికాయలు కొట్టి మోక్కుబడిని చెల్లించుకున్నారు. అనంతరం నాయకర్‌కి ఘనంగా సత్కారం చేశారు.

# రైతాంగాన్ని ఆదుకోండి

### :మాజీ డిప్యూటీ సీఎం కొట్టు డిమాండ్



తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్: భారీ వర్షాలు, వరదలకు తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం మండలంలో ఎర్రకాలవ ముంపునకు గురైన ప్రాంతాలలో శనివారం ఆయన పర్యటించి పరిశీలించారు. నందమూరు, మాధవరం,అప్పారావుపేట,పట్టింపాలెం, వీరంపాలెం, తదితర గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. నందమూరు అక్విడెక్టు వద్ద ఎర్ర కాలువ వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. పొలాలన్నీ వరద నీటితో మునిగిపోయి కనుచూపు మేరలో ఎర్ర కాలువ సముద్రంలా కనిపించడాన్ని చూసి ఆయన చలించారు. ప్రభుత్వం తక్షణమే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా జల యజ్ఞంలో భాగంగా ఎర్ర కాలువ ఆధునికీకరణ పనులు జరిగాయన్నారు. వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని కాలువ గర్భాన్ని పెంచడంతోపాటు, వెడల్పును పెంచి గట్లు పటిష్ట పరచవలసిన అవసరం ఉందన్నారు. ఈ పర్యటనలో ఆయన వెంట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముప్పిడి సంపత్ కుమార్, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, చెన్నా జనార్ధన్ రావు, జడ్డు హరిబాబు, వెలిశెట్టి నరేంద్ర కుమార్, పరిమి తులసీదాస్, నిమ్మల నాని, బండారు నాగు, కైగాల శ్రీనివాసరావు, పాలూరి శివ, బొద్దాని శ్రీనివాస్, పోలిమోను శ్రీనివాస్, బోనం వీరయ్య, మొలకల రాంబాబు, ముప్పిడి వెంకట్రామిరెడ్డి, కోనేటి దానయ్య, కృష్ణంరాజు తదితరులు ఉన్నారు.

# మెరుగైన సేవలు అందించడమే మా లక్ష్యం



### – బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనేజర్ ఆర్పీ రాజు వెల్లడి

జీలుగుమిల్లి,మేజర్ న్యూస్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి ఉత్తమ ఫలితాలు పొందాలన్నదే తమ లక్ష్యమని బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం బ్రాంచ్ మేనేజర్ ఆర్పీ రాజు వెల్లడించారు. బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ ఆర్ పి రాజు మాట్లాడుతూ రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. తొలుత బ్యాంకు వ్యవస్థాపకులు సాయాజీరావు గైక్వాడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. బ్యాంకు నియమాలను ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సేవా కార్యక్రమాలలో భాగంగా స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులు మంచినీరు త్రాగేందుకు ఉపయోగించే 50 లీటర్ల నీటిని నింపే సామర్థ్యం గల మూడు స్టీల్ డ్రమ్ములు, వాటిని ఏర్పాటు చేసేందుకు టూల్స్ ను వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్యాంక్ మేనేజర్‌లు ఎం.వీర బ్రహ్మం, డి.శ్రీ వేణుగోపాల్,హెడ్ క్యాషియర్స్ కట్టం. కిషోర్ కుమార్, కె.కృష్ణ బాబు,ఉపాధ్యాయులు వి.శాంత కుమారి,జీ.పేరమ్మ,పి అంజలీదేవి, గంగ చెల్లమ్మ, ఎం.సావిత్రి, ఖాతాదారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప కారాగారాన్ని తనిఖీ చేసిన అదనపు సివిల్ జడ్జి శ్రీనివాస్



నరసాపురం,మేజర్ న్యూస్: నర్సాపురం అధనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె.శ్రీనివాస్ స్థానిక ఉప కారాగారాన్ని శనివారం తనిఖీ చేశారు. ముందుగా వంటశాలను, ఆహార పదార్థాలను, జైల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. ముద్దాయిల కేసు వివరాలు, వారి ఆరోగ్యం పై ఆరా తీశారు. న్యాయవాదిని నియమించుకోలేని వారు జైల్ విజిటింగ్ లాయర్‌నీ సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునని,సెప్టెంబర్ 14 న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడతగిన క్రిమినల్ కేసులలో ఉన్న జైల్ ముద్దాయిలు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. బెయిల్ పై బయటకు వెళ్లిన వారు కేసు పూర్తి అయ్యేవరకు ప్రతీ వాయిదాకు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జైల్ విజి టింగ్ లాయర్ కె.శిరీష,లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కె.చిట్టి పద్మజ, ఉప కారాగారం పర్యవేక్షణఅధికారిటి.అప్పారావు,జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మార్టేరు ఎఇఎల్‌సి వ్యవస్థాపకులు విశ్వాస రావు అంతిమ యాత్ర



పెనుమంట్ర,మేజర్ న్యూస్ : మార్టేరు ఆంధ్ర ఇవాంజలికల్ లూథరన్ సంఘము వనంపల్లి వ్యవస్థాపకులు సంఘ కాపరి రెవ.పాస్టర్ ఆర్ విశ్వాస రావు శనివారం ప్రభువు నందు నిద్రించియున్నారు పెనుమంట్ర మండలం యు పి ఎఫ్ గౌరవ అధ్యక్షులు బిషప్ వడ్డీ చిట్టి బాబు అధ్యక్షతన అంతిమయాత్ర, భూస్థాపిత కార్యక్రమం ఘనంగా జరిగినది. పెనుమంట్ర మండలం యుపిఎఫ్ ప్రెసిడెంట్ రెవ.కె డేవిడ్ రాజు, సెక్రెటరీ బ్రదర్ బాలు, ఎం ప్రదీప్ ఆదరణ వాక్యములు తెలియజేయగా యుపిఎఫ్ వైస్ ప్రెసిడెంట్ ఏ థామస్ కార్యవర్గ సభ్యులు పాస్టర్స్ వై డేవిడ్ రాజు, వై జీవన్ కుమార్, ఎం ఆనంద్ విజ్జి పాస్టర్ సునీల్ ప్రార్థనలు చేయగా మరి కొందరు సేవకులు, గూటాల కనకరాజు, విశ్వతేజ కాలేజీ స్టాఫ్, యు.ముని బాబు బంధువులు సంఘ విశ్వాసులు, పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా ప్రభువుకు మహిమకరంగా కార్యక్రమాన్ని జరిగించారు.

## డ్రైనేజీ పొంగి రోడ్లపైకి వచ్చిన నీళ్లు



కైకలూరు,మేజర్ న్యూస్: గత కొద్ది రోజులుగా భారీ వర్షాలతో రోడ్లన్నీ జలమయం అయ్యి డ్రైనేజీ పొంగి రోడ్డుపైకి నీళ్లు రావటంతో ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురి అవుతున్నారు. శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు కైకలూరు మండలం ఆటపాక గ్రామ పరిధిలో ఎల్ఐసి ఆఫీస్ ఎదురుగా ఉన్న భీమవరం, కైకలూరు ప్రధాన రహదారిపై భారీ వర్షాలు కారణంగా డ్రైనేజీ పూడికపోవడం వలన రోడ్డుపై నీళ్ల నిలబడి ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక ప్రయాణికులకు, వాహనం దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలుసుకున్న కామినేని శ్రీనివాస్ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు కొల్లి వరప్రసాద్ (బాబి) ఆధ్వర్యంలో రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీలోని చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించి కొంత మేర నీళ్లు నిలవకుండా ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేసి నారు. ఈ కార్యక్రమంలో కైకలూరు జనసేన పార్టీ నాయకులు తులసి పూర్ణ,తోట సంజయ్, వేల్పురి మణికంఠ, బొబ్బిలి సాయి ,ఆటపాక గ్రామపంచాయతీ సర్పంచ్ భర్త తలారి జాన్, విజయ్ గ్రామపంచాయతీ గుమస్తా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ముంపునకు గురైన వరి చేలను సందర్శించిన శాస్త్రవేత్తల బృందాలు



పెనుమంట్ర,మేజర్ న్యూస్ : ఈ నెల 18, 19 వ తేదీలలో కురిసిన అతి భారీ వర్షాల నేపధ్యంలో 20వ తేదీన గోదావరి మండలం లోని మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, ఏరువాక కేంద్రాలు, కెవికె,వ్యవసాయ శాఖాధికారులతో కూడిన బృందాలు, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి, ఏలూరు, డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ,కాకినాడ జిల్లాలలో ముంపుకు గురైన వరి చేలను విస్తృతంగా సందర్శించి రైతులకు మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధనా సంచాలకులు డా.టి.శ్రీనివాస్ తగుసూచనలు చేసారు. ఈ సందర్భంగా అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ డా. టి.శ్రీనివాస్ మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లాలో 50 హెక్టార్లలో నారుమడి,8,420 హెక్టార్లలో ప్రాధన పొలం, పశ్చిమ గోదావరి జిల్లాలో 600 హెక్టార్ల నారుమడి, 6765 హెక్టార్ల ప్రధాన పొలం, కాకినాడ జిల్లాలో 79.81 హెక్టార్ల నారుమడి, 1545.7 హెక్టార్లలో ప్రధాన పొలం, కోనసీమ జిల్లాలో 86.64 హెక్టార్ల నారుమడి, 27.10 హెక్టార్ల ప్రధాన పొలం, ఏలూరు జిల్లాలో 97 హెక్టార్ల నారుమడి, 16.95 హెక్టార్లలో ప్రధాన పొలం ముంపుకు గురైనట్లుగా తెలిపారు. మొత్తంగా గోదావరి మండలంలోని ఐదు జిల్లాలలో 913. 45 హెక్టార్లలో నారుమడి, 17,074.75 హెక్టార్లలో ప్రాధన పొలం ముంపుకు గురైనట్లుగా తెలిపారు. విత్తనం కావలసిన రైతులు డా.జె.దయాళ్ ప్రసాద్‌బాబు, ప్రధాన శాస్త్రవేత్త వారిని 9490913434 నంబర్‌లో ఫోన్ ద్వారా లేదా వాట్స్ఆప్ ద్వారా సంప్రదించాలని కోరారు.

# చెరువులను తలపిస్తున్న రహదారులు

### – సహాయక చర్యలు చేపట్టిన టిడిపి నేత గొర్రెల శ్రీధర్



తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్: స్థానిక 19వ వార్డు, భాగ్యలక్ష్మి పేటలలో గత 3 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లు, ఖాళీ స్థలాలు చెరువులను తలపిస్తున్నాయి. జయలక్ష్మి థియేటర్ వెనక ఉన్న పార్క్ వెనకాల ఉన్న కాలనీ మొత్తం నీట మునిగిపోయింది.ఈ పరిస్తులను గమనించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, తాడేపల్లిగూడెం మున్సిపల్ వైస్ మాజీ చైర్మన్ గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో 19వ వార్డు మున్సిపల్ సానిటరీ సెక్షన్, ఇంజనీరింగ్ సెక్షన్ వారితో మాట్లాడి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఆ నీరు,రోడ్లుకి సంభందిన నీరు బయటికి వెళ్లేలా ఆయనే స్వయంగా ఆ వీధిల్లోకి వెళ్లి సమస్యలను చూసి పరిష్కారం చేపట్టే దిశగా మున్సిపల్ వర్కర్స్‌తో సరి చేయించారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ బోజంకి శ్రీనివాస్, కూటమి సభ్యులు మైలవరపు నారాయణ, పట్టపు నాగశ్రీను, పప్పొప్పుల త్రినాధ్, వెల్డింగ్ షాప్ బుజ్జి,వెంకటేశ్వరరావు, సోనీ, పాల్గొనడం జరిగింది.

## శాకాంబరి అలంకారంలో దర్శనమిచ్చిన రాట్నాలమ్మ అమ్మవారు



పెదవేగి,మేజర్ న్యూస్ : కొలిచిన వారికి కొంగు బంగారమై కోరిన కోరికలు తీర్చే అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ శ్రీ రాట్నాలమ్మఅమ్మవారు శనివారం శాఖంబరి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీ రాట్నాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ప్రతి సంవత్సరం ఆషాడ శుద్ధ త్రయోదశి నుంచి గురుపౌర్ణమి వరకు శాకంబరీ దేవి ఉత్సవాలు నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో చాల ప్రాంతాలలో ఇదే సాంప్రదాయం పాటిస్తున్నారు.

కొన్ని ప్రాంతాల్లో మాత్రం నాలుగు నవరాత్రుల్లో భాగంగా కూడా ఒకరోజు శాకంబరీ దేవి ఉత్సవం నిర్వహిస్తారు. మరికొంత మంది ఆషాఢ నవరాత్రి మొత్తాన్ని శాకంబరి నవరాత్రిగాజరుపుకుంటారు. అమ్మవారి శాకంబరి దేవి అవతారం మనిషి ఆకలిని తీర్చడానికి ఉద్భవించింది. ఈ దేవిని పూజించటం వల్ల క్షామం నుండి విముక్తి లభిస్తుంది ఆకలి దరి చేరదు అని భక్తులు విశ్వసిస్తారు. కూరగాయలు, పండ్లతో అలంకారం శాకంబరీ దేవి ఉత్సవం సందర్భంగా,అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు మరియు పండ్లతో శోభాయమానంగా అలంకరించారు.భక్తులు కూడా దక్షిణగా పండ్లు, కూరగాయలు సమర్పిస్తారని,ఈ శాకంబరి అవతారం గురించి ఆలయ ప్రధా అర్చకులు పి.బి.ఎస్.ఎన్ శర్మ వివరించారు.

## తాడేపల్లిగూడెం మండలంలో 11709 ఎకరాల్లో మునిగిన వరి పంట



తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్: తాడేపల్లిగూడెం మండలంలో 11709 ఎకరాల్లో వరి పంట మునిగింది మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్ ప్రసాద్ తెలియజేశారు దానిలో ఎర్ర కాలువ హేయ్ కట్టు కింద సుమారు 874 ఎకరాలు వరి పంట నీట మునిగిందని అలాగే అధిక వర్షాల వల్ల ఈ పిల్ల కాలువలు పొంగటం వలన 3636 ఎకరాల్లో వరి నీట మునిగిందని తెలిపారు.అంతేకాకుండా 8హెక్టార్లలో వరి నారుమళ్ళు కూడా నీట మునిగిపోయాయని తెలిపారు. పెద్దతాడేపల్లి, చిన్నతాడేపల్లి, కోండ్రుప్రోలు, మాధవరం, మోదుగుంట, నందమూరు, నవాబుపాలెం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి పర్యటించారు. జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు మాధవరంలో ఉన్న ఎర్రకాలువ ఉధృతిని పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి మాధవరం నందమూరు, నవాబుపాలెం మోదుగుంట గ్రామాల్లో సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులపై మురళి కృష్ణ మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్ ప్రసాద్, ఆర్ ఎస్ కే ఇన్చార్జిలు గోవర్ధిని, సురేష్ సతీష్, నవీన పాల్గొన్నారు. మోదుగుంట సర్పంచ్ జానకిరామయ్య మాధవరం సర్పంచ్,నాయకులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సమన్వంతో పని చేయండి - అధికారులకు ఎమ్మెల్యే నాయకర్ సూచన



నర్సాపురం,మేజర్ న్యూస్ : రెండు నియోజకవర్గాల అధికారులు సమన్వయంతో పని చేస్తే భవిష్యత్తులో సమస్యలు రాకుండా ఉంటాయని నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం భీమవరం జాయింట్ కలెక్టర్‌ని కలిసేందుకు కాళీపట్నం మీదుగా భీమవరం వెళ్తుండగా రోడ్డు పరిస్థితి చూసి భీమవరం మున్సిపల్ పరిదికి చేరుకోగా డ్రైనేజీ క్లియరెన్స్ పనులు చూస్తూ వాటి పనితీరును ప్రశ్నించారు. సమన్వయంతో రెండు నియోజకవర్గాల డ్రెయినేజీల సమీక్ష చేసుకునేలా ఉండాలని చిన్నచిన్న పనులు సకాలంలో చేపించుకుంటే పెద్ద సమస్యలు తలెత్తకుండా ఉంటాయని అధికారులకు సూచించారు. మున్సిపల్ పరిధి డ్రైనేజీలనీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు వెళ్లేలా కింద రూరల్ డ్రైనేజీస్ అనుసంధానం జరగాలని ఎప్పటికప్పుడు పూడికలు తీసేలా ఉండాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట పలువురు ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

## ముంపుకు గురైన పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారిణి



పెనుగొండ,మేజర్ న్యూస్: మండలంలో కురిసిన భారీ వర్షానికి ముంపుకు గురైన పంటపొలాలను శనివారం మండల వ్యవసాయ అధికారిణ పి.స్పందన, రైతు సేవా కేంద్ర సిబ్బందితో కలిసి పంట పొలాలను పరిశీలించారు.మండలంలోని 14 గ్రామాల్లో సుమారు 63 హెక్టార్ల నారుమడి,1320 హెక్టార్ల వూడ్చిన చేలు నీటిముంపునకు గురైనట్లు గుర్తించారు. మురుగునీటి సమస్యలను త్వరగా పరిష్కరించాలని సంబంధిత శాఖల వారికి సూచించారు.

## వరద బాధితులకి నిత్యావసర సరుకులు పంపిణీ



కుక్కునూర్,మేజర్ న్యూస్ : పేదలకు కష్టం వచ్చిందంటే ముందుగా ఆదుకునేది జనసేన పార్టీ అని మరొకసారి రుజువైంది. మండల పరిధిలోని ఉప్పేరు పంచాయతీ రెడ్డి గూడెంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగు పొంగి గిరిజనులు నివాసాలు కొట్టుకుపోవడంతో నిరాశ్రయులైన బాధితులకు కుక్కునూరు జనసేన నాయకులు చల్ల కోటి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. మండలంలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా తనవంతుగా సహాయసహకారాలు అందిస్తూనే వస్తున్నారు. జనసేన అధినేత సిద్ధాంతాలు ఆయన చేస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకున్న కోటి తనకు చేతనైన సేవ చేస్తూనే వస్తున్నారు.ఈ సందర్భంగా చల్ల కోటి మాట్లాడుతూ మా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆదేశాలు ప్రకారం వరద భాదితులకు సహాయం చెయ్యాలని పిలుపునివ్వగా అందులో భాగంగా నిత్యవసరాలు పంపిణి కార్యక్రమం చేసానని తెలిపారు. జనసేన సేవలు పట్ల జనసేన నాయకులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాలలో రక్తదాన శిబిరం




పెదవేగి,మేజర్ న్యూస్ : దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాలలో రెడ్ క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో శనివారం 50 మంది వైద్య విద్యార్థులు రక్తదానం చేశారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.స్లీవ రాజ్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీలో రక్త మార్పిడి చికిత్స పొందుతున్న తల సేమియా వ్యాధి చిన్నారుల కోసం ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సంవత్సరానికి మూడు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రక్తదానం చేసిన వైద్య విద్యార్థులకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజేష్, అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఎల్. ఫిలిక్స్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.స్లీవరాజ్,డాక్టర్ ఎం.పావన సంధ్య, డాక్టర్ జి స్పందన, పి.ఆర్వో కె.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



ఆచంట,మేజర్ న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సి.ఐ.టి.యు) జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వర్రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకత్వం తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో వాగ్దానం చేసారని తెలిపారు. 2018 నుండి ఆగిపోయిన పెండింగ్ క్లెయిమ్ నిధులు విడుదల చేయాలని, కరోనా కారణంగా మరణించిన కార్మికులందరికీ భీమా వర్తింపచేయాలని ఫ్లిప్తి చేసారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆచంట మండల కమిటీ నాయకులు పూసల ఏడుకొండలు,సానబోయిన సత్యన్నారాయణ పాల్గొన్నారు.